వెయ్యాని శిక్ష

[కథానిక]

శ్రీ రా. సీ. ఆంజనేయశాస్త్రి

చాలాకాలంనుంచీ తీసుకుంటూ ఉండి యిప్పుడు చచ్చిపోవడంవల్ల రామయ్య భార్య మాణిక్యమ్మమృతి కెవరూ వ్యాఖ్యానాలు చెయ్యలేదు. లోలోపల ఏమి ఆవేదన పడుతున్నా, రామయ్యకైనా, భార్య మరణానికీ, తను చేసిన హత్యకూ సంబంధ మేమీ స్ఫురించలేదు. కాని నెల తిరక్కముందే, గిండీ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుకుంటున్న అతని పెంపుడుకొడుకు సుదర్శనం ప్రమాదవశాత్తు ఎలెక్ట్రిక్ ట్రెయినులోంచి పడి మరణించాడని తంతివార్త రాగానే ఊరంతా "నిండుప్రాణం తీసిన ఉసురు ..." అని నిర్ధారణగా చెప్పేశారు. రామయ్యకూ నమ్మక తప్పలేదు. అవును. తను తాసిల్దారు సుబ్రహ్మణ్యాన్ని చంపిన మాట వాస్తవమే. చంపాలని చంపలేదు. పదహారు వేలిస్తానన్నా ఒప్పుకోక, తనమీద "పర్మిటు లేకుండా బియ్యం రవాణాచేస్తున్నా"డనే కేసు పెట్టటానికి కూర్చున్నాడయ్యె! కేసే పెడితే తను తలెత్తుకు తిరగగలడూ? బెదిరిద్దామనే ఉద్దేశంతో కర్ర ఎత్తినమాట నిజమే. నిర్లక్ష్యంగా నవ్వుతూ జీప్ కారెక్కి "ఇక పోనియ్యవోయ్ కాసిం" అనేసరికి ఒళ్ళు భగ్గుమంది. ఆలోచించటానికి టైమేదీ? వెయ్యనే వేశాడు దెబ్బ! అలా వచ్చాయి రోజులు! మాడు పగిలే పోవాలీ? సరే, చచ్చిపోయాడా పుణ్యాత్ముడు. తన నెవరూ అరెస్టు చేయలేదు. ఇదివరకటంత పెద్దమనిషిగానే తిరుగుతున్నా డిప్పుడూను. దొంగవ్యాపారం కూడా యథాపూర్వం చక్కగానే జరుగుతోంది... అయినా ఏదో బాధ, మంట, ఆవేదన ఎందుకు వేధించాలి తనని? ఆఖరికొక్కమాటైనా సుబ్రహ్మణ్యం తనకు కలలోకూడా కనపడలేదు. కాని క్షణక్షణమూ అతను తనను వెంబడించి "నన్నెందుకు చంపావు? ... నాపిల్లల గతేం కాను?... లంచం పుచ్చుకోకపోయినందుకు నాకు చావూనూ, అలాంటి నన్ను చంపిన నీకు స్వేచ్ఛానా?" అని ప్రశ్నిస్తున్నట్టు బాధపడుతున్నాడు. ఆ ప్రశ్నలకు సమాధానం భూతలంలో ఎక్కడా కనిపించలేదు రామయ్యకు. ఒక్కొక్కప్పుడు-అర్ధరాత్రివేళ పెనుభూతాలల్లే ఆ ప్రశ్నలు అతని గుండెలమీద ఎక్కికూర్చుని కంఠం పిసికి ఊపిరి సలపకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. సుబ్రహ్మణ్యం దగ్గరికే తను వెళ్లగలిగితే తప్పంతా తనదేననీ, ఏ శిక్షకన్నా తల ఒగ్గుతాననీ చెప్పేసేవాడే! కాని అలాంటి అవకాశ మేమీ

యీ లోకంలో కనిపించేటట్టు లేదు. "హంతకుడను నేనే" నని పోలీసుస్టేషను కెళ్ళి చెప్పేద్దా మనుకున్నాడుకూడాను ఓ మాటు. తీరా వెళ్ళి చెబితే "వీడు పిచ్చివా" డని నెట్టేస్తారేమో! అంతకుముందే నలుగురు యానాదివాళ్ళను అరెస్టు చెయ్యడమూ, సుబ్రహ్మణ్యాన్ని చంపింది వాళ్లేనని కోర్టులో ఋజువవడమూ జరిగిందయ్యె! సెషన్సుజడ్జి కన్నా అసలువిషయం తెలియకపోదనీ, కేసు తప్పకుండా కొట్టేస్తాడనీ రామయ్య అనుకున్నాడు. కాని ఆయన హంతకులలో ఒకడికి ఉరిశిక్షా, తక్కిన ముగ్గురికీ యావజ్జీవ శిక్షా వేశాడు. ఆ సాయంత్రమే చెన్నపట్నంనుంచి తంతి ఒచ్చింది రామయ్యకు— "సుదర్శనం ఎలెక్ట్రిక్ రైలుకింద పడి చచ్చిపోయా" డని. అతనికి గంగవెర్రులెత్తాయి. కొడుకు పోయిన దుఃఖంకంటె నిరపరాధిని ఉరితీస్తారేమో ననే బాధ భరింపరానిదై పోయింది. శవాన్ని చూడటానికని పట్నం వెళ్లిన రామయ్య వారంరోజులయినా తిరిగి రాలేదు.

౨

అర్థబలంగాని, అంగబలంగాని ఏ మాత్రమూ లేని యానాదులు హైకోర్టుకు అప్పీలుచేస్తారని ఎవరూ అనుకోలేదు. తన పేరు బయటికి రానియ్య వద్దని లాయరుతో ఎంత గట్టిగా చెప్పినా, ఊళ్లోమటుకు అందరికీ తెలిసిపోయింది-రామయ్యే అప్పీలుఖర్చంతా పెట్టుకుని ముద్దాయీలపక్షాన పనిచేశాడని. "ఎవడికోసం చేస్తాడు? లేకపోతే పురుగులు పడి చావడూ—ఏపాపమూ ఎరగనివాళ్లని ఉరితీయిస్తే!" అన్నారు జనం చాటుచాటుగా. హైకోర్టువారు కేసు కొట్టేశారు. విడుదలయిన యానాదులు నలుగురూ ఒచ్చి "ప్రాణం రక్షించిన ప్రభువులు మీారు!" అంటూ రామయ్యకాళ్లకు మొక్కితే, అతను దుఃఖం ఆపుకోలేకపోయాడు. ఎక్కెక్కేడుస్తూ, కన్నీళ్లు చాటుగా తుడుచుకుని, తలోవందా యిచ్చి "మీా రసలు దొంగజాతుల లిస్టులో కెందుకొచ్చారు?... హాయిగా ఏపనన్నా చూసుకోండి..." అని పంపించేశాడు.

ప్రపంచంలోని బరువైన వస్తువులన్నీ తన ఎదుర్రొమ్ముమీాద ఎవరో పేరుస్తున్నట్టు కుంగిపోతున్న రామయ్యకు యానాదుల విడుదల ఒక విశ్రాంతిని కలగజేసిన ట్టనిపించింది. కుమారుని మరణంవల్లకూడా తను మరింత తేలికపడ్డానని తరవాత తెలుసుకున్నాడు. భార్యమరణంమటు కతని బాధ నేమీా తగ్గించలేదు. అప్పటి కింకా, పోలీసువాళ్లు తనను పట్టుకుంటారేమో, పట్టుకుంటే ఎలా లంచాలిచ్చి తప్పించుకోవాలి, తీరా విచారణకే వస్తే జడ్జీకికూడా చెప్పాల్సొస్తుందేమో అనే ఆలోచనల్లోనే ఉన్నాడు.

ఏకోర్టులూ వెయ్యలేని శిక్ష సంఘం వెయ్యగలదు. సంఘంకూడా వెయ్యలేని శిక్ష మనస్సు వెయ్యగలదు. భార్యా, కొడుకూ చావటంవల్ల రామయ్యకు తగిన శిక్ష వేసినట్లే నని సంఘం సరిపెట్టుకుంది ఒకవిధంగా. కాని సుబ్రహ్మణ్యం అవివాహితకుమార్తెల మాట తలపుకొచ్చి రామయ్య రోజూ అర్ధరాత్రివేళ్ల నానాహైరానా పడటంమాత్రం ఇదివరకు మాదిరిగానే జరుగుతూనే వుంది. ఏదో అవ్యక్తశక్తి గుండెలు పట్టుకుని ఊపి చెంపదెబ్బ కొట్టి, "ఒరేయ్! రామయ్యా

తాసిల్దారును చంపి దిక్కులేనివాళ్లను చేశావుగదట్రా పాపం ఆ పిల్లల్ని. వాళ్లు పెళ్లీ పెటాకులూ లేకుండా, అన్నంమెతుకులక్కూడా మొహం వాచి అఘోరిస్తుంటే, నిశ్చింతగా నిద్రపోదా మనుకుంటున్నావా ? లే వెధవా ! నీకడుపు చీలుస్తా" అని తనను తరుముతున్న ట్లనిపిస్తుంది. లేచి కూర్చుంటాడు తప్పనిసరిగా. ఇలా తనను హింసించడం కంటే మామూలుకోర్టువారు ఉరిశిక్ష వేసినా బాగుండును, ఒక్క అరగంట బాధతో సరిపోయేది !

తను తన తండ్రికి పెంపుడు. తనకు పిల్లలు లేక తనూ మళ్లా పెంపుడుచేసుకున్న సుదర్శనం యిలా అయ్యె ! ఇరుపార్శ్వాలా నా అనేవాళ్లెవరూ లేరు. ఎందుకూ యీ ఆస్తంతా? తగలేసుకోనా? ఈ ఆస్తంతా ఎవరన్నా తీసుకుని తనకు మనశ్శాంతి ప్రసాదించరాదూ? అలాంటి శక్తిగలవాళ్లే ఉంటే ప్రపంచంలోని కోటీశ్వరులు నిశ్చింతతో ఎన్నిహత్యలన్నా చెయ్యొచ్చు !

3

తన తండ్రిని చంపిన రామయ్యను చూడటానికి సావిత్రి కెంతమాత్రమూ మనస్సొప్పలేదు యింతకాలమూను. చూసే వుంటే ఈపాటికే గరల్‌స్కూలులో ఉద్యోగం ఒచ్చేది. ఇక తప్పేటట్లు కనిపించలేదు. తండ్రి ఇన్సూరుచేసిపోయాడు కనక ఆ డబ్బుపెట్టుకుని యింతకాలం గుట్టుగా కాలం గడిపారు అప్పచెల్లెళ్లు నలుగురూ. ఇప్పుడా డబ్బు కాస్తా అయిపోయింది. నలుగురు కన్యలు మాత్రమే, వేరే మొగసహాయంలేకుండా, ఒక యింట్లో కాపురం వుంటే ఊళ్ళో యువకుల కెంత తేలిక భావమో సాధారణంగా ఊహించవచ్చు. కాని తాసిల్దారు సంపాయించిపోయిన మంచి పేరునుబట్టి ఆ యిల్లింతవరకూ ఎలాంటి అల్లర్లకూ గురికాలేదు. పెళ్లిళ్లయి కాపురాలు చేసుకుంటున్న ముగ్గు రప్పల్లోనూ రెండోఆమె భర్త జిల్లాజడ్జి కావడంచేత కన్నూ మిన్నూ కానకుండా వుంది. వాళ్లు వీరి గడపే తొక్కరు. మూడోఆమెభర్త అతి సనాతనభావాలు కలవాడు. రజస్వలలయి ఏళ్ళు గడిచినా పెళ్లిళ్లు చేసుకోకుండా కూర్చున్న మరదళ్ళ నీడ పడితేనే సనాతనత్వమంతా మంట కలుస్తుందని వీళ్లని దాదాపు వెలివేశాడు. మొదటి అప్ప సంసారపక్షం. మేనరికంకూడానయ్యె! అడపాదడపా ఒచ్చిపోతూండటం కద్దుగాని నడుంకట్టుకు మరదళ్ళ పెళ్లిళ్లు చేసేటంత తాహతు కలవాడు మాత్రం కాదు ఆమెభర్త సాంబయ్య. ఉద్యోగంకోసం అంటూ చదవకపోయినా ఇల్లు గడవటానికి ఉద్యోగం చెయ్యాలిసొచ్చేసరికా చదువే అక్కర కొచ్చింది సావిత్రికి. దరఖాస్తులో తన స్థితిగతులూ, తండ్రిపేరుప్రతిష్ఠలూ అన్నీ ఉదాహరించినా, సిఫారసు లేనిదే ఉద్యోగం రావటం అసంభవ మని తేలిపోయింది. రామయ్య ఆ కమిటీ ప్రెసిడెంటుతో ఒక్క నోటిమాట చెబితేచాలు, టక్కున వేసి తీరాలి. అంత విలువ వుంది అతని మాటకు. అయితే తన పితృహంతకుడిని తా నెళ్లి అర్థిస్తుందా?

తన బావగారైన జిల్లాజడ్జిని ఒక్కమాటు చూస్తే ఎక్కడో అక్కడ ఉద్యోగం ఇప్పిస్తాడని మన స్సూరించిందికాని, తండ్రి

పోయినతర్వాత యింతవరకూ తిరిగన్నా చూడని అప్పగుమ్మంలో కెళ్లటంకన్నా రామయ్యను ఒకమాటు సాయంచేయమని కోరటమే మెరుగనిపించింది సావిత్రికి. ఆత్మాభిమానం గల చెల్లెళ్లూ అదే సలహా చెప్పారు. చచ్చిపోయిన తల్లినీ, చంపబడ్డ తండ్రినీ, నిర్లక్ష్యం చేసిన అప్పనూ, వెలేసిన బావనూ, తమ దుస్థితినీ తలచుకుని తెల్లవార్లూ దుఃఖించటంవల్ల తెల్లవారకట్ల ఏం కునుకుపట్టిందో ఏమో పాపం, సావిత్రికి మెళుకువ వచ్చేసరికి బారెడు ప్రొద్దెక్కింది.

అప్పుడే రైలు దిగొచ్చిన సాంబయ్యను చూసి సావిత్రి బావురుమంది—"బావా! మా గతేమిటీ?" అంటూను. సహజంగా గంభీరస్వభావ అయిన సావిత్రి అంత బేలగా దుఃఖించడం సాంబయ్యకే ఆశ్చర్యంవేసింది. అనుకున్నప్రకారం ఉద్యోగం రాలేదని మాత్రం గ్రహించాడు. అంతమాత్రానికే యింత బిగలాపడాలా?

"ఎందుకు సావిత్రీ అలా యిడవుతావు? సంగతేమిటి?" అన్నాడు సాంబయ్య.

"నా పితృహంతకుడిని 'భిక్షాం దేహి' అనాల్సిన దురవస్థ పట్టింది బావా" అంది సావిత్రి ఎక్కెక్కేడుస్తూను. సాంబయ్యకు సరిగా అర్థంకాలేదు. చిన్నమరదలు సరస్వతి చెప్పింది "రామయ్య సిఫార్సుచేస్తే గరల్ స్కూలులో ఉద్యోగం యిస్తారనే ఉద్దేశంతో అతన్ని చూడా లనుకుంటోంది అక్కయ్య" అని.

సాంబయ్య దీర్ఘనిశ్వాసం విడుస్తూ ఒక క్షణం ఆగి "నువ్వు వెళ్ళొద్దు సావిత్రీ. రామయ్యతో నేను మాట్లా డొస్తా" నన్నాడు. ఏదో భారం దిగిపోయినట్లు సావిత్రి తేరిపిగా చూస్తూ "అయితే ఇప్పుడే వెళ్లిరా బావా! పొద్దెక్కితే ఆయన ఊళ్లోకి పోతాడేమో" అంది.

'భిక్షాందేహి!' అని తనడిగితే ఒకటీ, తన తరఫున మరొకరడిగితే ఒకటీనా? వేస్తే గీస్తే ఆ ధర్మదాత వేసే ముష్టి ఎలాగూ తనకేగా! ఏమిటో వెధవమనస్సు! పిచ్చి తృప్తి!!

సాంబయ్య వెళ్ళేసరికి రామయ్య మంచంమీద పడుకునేఉన్నా డింకా. తెల్లవార్లూ అసలు నిద్దరేపట్టలేదట. కళ్లల్లో ఒత్తులేసుక్కూర్చున్నవాడు కూర్చున్నట్టే ఉన్నాడు ఉబ్బసం తెర రావడంవల్ల. తెల్లగా తెల్లారింతర్వాత కాస్త నడుంవాల్చాడు. కొంచెం కునుకుపట్టిందో, లేదో "కడుపులో మంట బాబోయ్" అంటూ లేచికూర్చున్నాడు. మళ్ళా దగ్గుతెర నిలవేసింది. ఓ మోతాదుమందు పుచ్చుకుని డాక్టరుకోసం నౌకరును పరిగెత్తించాడు. డాక్టరొచ్చి ఒక ఇంజెక్షనిచ్చి వెళ్ళేసరికి దగ్గు కాస్త తమాయించడంవల్ల మళ్లా కాస్త పడుకున్నాడు. బాగా వయస్సుమళ్లిన వంటమనిషీ, ఒకరిద్దరు నౌకర్లూ తప్ప యింట్లో ఎవరూ లేకపోవడంచేత దివాణంలాటి లోగిలి బావురుమంటోంది. ఆ ముసలమ్మ కాస్త దూరపు చుట్టంకూడా అవడంచేత కేవలం వంటమనిషిమాదిరి కాకుండా, కాస్తంత ఆదరంతో రామయ్యకు మందూ మాకూ యిస్తూ కనిపెట్టుకునివుంటోంది.

వ్యాధేమాత్రమూ ప్రమాదకరమైంది కాకపోయినా, అదేం చిత్రమోగాని, తా

నింకా ఆట్టేకాలం జీవించవనే అధైర్యం పుట్టింది రామయ్యకు. వ్యాపారమంతా గుమాస్తాల కప్పగించేశాడు. "ఆస్తిపాస్తు లేంచేద్దామా" అనే ఆలోచనలోకూడా పడ్డాడు. ఏ దేవస్థానానికో, సత్రానికో రాసి పారేస్తే ఆలోకంలో యిన్నిగిళ్లు పుట్టు తాయి. ఏమో! తనకే నమ్మకం లేక పోయింది! ఈలోకంలో యింత వ్యథ అను భవించాడుకదా! ఆ లోకంలోమటుకు తననిది విడిచిపెడుతుందా? మళ్ళా ఓకుర్రాణ్ణి దత్తు చేసుకుంటే, నోట్లో యిన్ని నీళ్ళన్నా పోస్తాడు. ఏమో! ఎవరి కెన్నిరోజులు నీ ళ్లున్నాయో యీమట్టిమీద! సుదర్శనం నన్నువిడిచిపెట్టి వెళ్ళిపోలేదూ? ఇలాగే తీసు కుంటూ ఇంకా త నెంతకాలం బతకా ల్సుందో! "పాపీ చిరాయుః" అన్నారు. తీరా నిశ్శేషంలాంటి ఏకుర్రాడో యీ పాపిష్ఠివాడి చేతుల్లో పడగానే ఎగిరిపోతాడేమో!

తాసిల్దారుగారి కూతుళ్లు చాలా కష్ట దశలో ఉన్నారని ఆనోటా ఆనోటా వింటు న్నాడు తను. ఒక్కమాటు వెళ్లి వాళ్ల కాళ్లమీద పడి, క్షమార్పణ వేడి యీ ఆస్తంతా వాళ్ల కప్పజెప్పితే, తను మనశ్శాంతితో నిశ్చింతగా చావవచ్చు. కాని తనకు మొహం చెల్లుతుందీ వాళ్ల ఎదుట పడటానికి? పోనీ, ఎవరిచేతనన్నా కబురుచేస్తే? అవును. అది బాగానే వుంది... ఇవాళ సుబ్బయ్యను పంపాలి అనుకుంటా గాని, వాళ్ళ నిక్కడికి రమ్మని కబురుచేస్తే ఒస్తారూ? పోనీ, తనే వెళ్లితే... నమ్ము తారూ తనను? కాదుకాదు...వాళ్లపేర విల్లు రాసేసి. ఆత్మహత్యచేసుకుంటే!... మళ్లీ దగ్గుతెరా...గుండెమంటా ఒచ్చింది... శ్రీరామరామా! పగవాడికికూడా ఒద్దురా బాబూ............

కళ్లు తెరిచి చూసేసరికి ఎదురుగుండా కుర్చీలో కొత్తాయ నెవరో కూర్చునివుండటం కనిపించింది. సాంబయ్య ఫలానా అని రామ య్యకు తెలీదు. ప్రశ్నార్థకంగా చూస్తున్న రామయ్యచూపులకు సాంబయ్య లేచి నిల బడి "...నేను సుబ్రహ్మణ్యంగారి అల్లుడి నండి...అంటే...తాసీల్దారుగా యిక్కడ పని చేస్తుండగా, దొంగలు కొట్టి చంపారు చూశారూ, ఆ సుబ్రహ్మణ్యంగారికండి... నేను మేనల్లుణ్ణికూడాను......నా పేరు సాంబయ్య అంటారు...ఏదో...తమతో..." అర్ధోక్తిలోనే రామయ్య ఇక ఆపమటూ సైగచేశాడు. తను అధికప్రసంగం చేశా నేమోననీ, ఒచ్చినపని సానుకూలపడదేమో ననీ భయపడ్డాడు సాంబయ్య. రామయ్య తల తిరిగిపోయిన ట్టయింది. తా నెత్తిన కర్రా, వేసిన దెబ్బ, పగిలిన నెత్తీ, కారిన రక్తమూ...అన్నీ ఒక్కమాటు తెరమీద సినిమాచిత్రాలల్లే పరిగెత్తి కళ్లు బైర్లుకమ్మిం చాయి. సంతతధారగా కన్నీరు కారటం మొదలెట్టింది. సాక్షాత్తు సుబ్రహ్మణ్యమే ఎదటి కొచ్చిన ట్టనిపించింది-మేనమామపోలి కలు తీర్చిదిద్దినట్లు, మేనల్లుడు సాంబయ్య మొహంలో స్పష్టంగా కనపడటంవల్లనో ఏమో! రామయ్య యింత జబ్బుస్థితిలో ఉన్నాడని తెలీదు తనకు. తెలిస్తే యిప్పు డొచ్చేవాడే కాదు. ఆయనకు కష్టం కలి గించేమాట తనైనా అన్న దేముంది? ఫలానా అని గుర్తుచెయ్యటానికి "దొంగలు కొట్టి చంపిన తాసిల్దారుగా"రని చెప్పాడు...... సిఫారసు చెయ్యకపోతే పోనీగాని...కొంప

తీసి నామీదా, మరదళ్లమీదా దెబ్బ తియ్యడుకదా!...పుట్టలోఉన్న తాచును లేవగొట్టాడేమిటి తను కర్మంకాలి! మనిషి రక్తం ఒకమాటు రుచిచూస్తే ఇక ఒదలరంటారుకూడాను......

ఏం ప్రమాదం మూడుతుందోనని కంగారుపడుతూ గాభరాగా ..."చిత్తం! ... నేను మనవిచేసేది..." అంటూ ఏమో చెప్పబోతున్న సాంబయ్యను మంచందగ్గిరిగా రమ్మని పిలిచి "...మీరు సుబ్రహ్మణ్యంగారి అల్లుడుగారా !... మేనల్లుళ్లకూడానా ..." అంటూ కావిలించుకున్నట్లుగా మీద చేతువేసి పసిపిల్లాడల్లే బావురు మన్నాడు రామయ్య."ఆయన్ను చంపిం దెవరో మీకు తెలీదూ?..." అన్నాడు ఏడుస్తూనే... సాంబయ్యకంగారు మరీ ఎక్కువైంది. అతను సమాధానం చెప్పకముందే రామయ్య —"మీకే కాదు ... ప్రపంచానికంతా తెలుసు. ఎవరికీ తెలియకపోయినా... ఆ పరమాత్ముడికి తెలుసు...ఆయనకూ తెలీకపోయినా ... చచ్చి స్వర్గానఉన్న ఆ సుబ్రహ్మణ్యంగారికి తెలుసు... కనీసం నాకన్నా తెలుసు సాంబయ్యగారూ... ఈ ఛండాలుడు కదూ ఆయన్ను చంపింది..." అని మళ్ళీ బావురుమన్నాడు.

"నావల్ల అపరాధమైతే..." నంటూ సాంబయ్య ఏమో చెప్పబోతూంటే అర్ధోక్తిలోనే రామయ్య అందుకుని "...ఎంతకాలమని కుమిలికుమిలి చావను సాంబయ్యగారూ!... క్షమార్పణ కోరుకుంటానికి కూడా నాకు మొహం చెల్లటంలేదు. ఆయన సాక్షాత్తు ధర్మరాజు. ఆయనే ఇప్పుడుంటే తనను హత్యచేసిన నన్ను తప్పకుండా క్షమించితీరేవాడు. నాకీ శిక్ష ఎంతకాలం? నన్ను క్షమించరూ? మీరూ, మీభార్యా, మరదళ్లూ—ఒకరేమిటి? సుబ్రహ్మణ్యంగారి రక్తస్పర్శ గలవాళ్లంతా నేను చిందించిన ఆయనరక్తాన్ని ఒక్కొక్క చుక్కే తమ రక్తంలో కలుపుకుంటే నా యీచేతుల మరకలుపోతాయి..."అని ఆగాడు.సాంబయ్యకిలాంటి మాటలు వినడం యిదే మొదలు. అందులోనూ రామయ్యలాంటి లక్షాధికారి తనలాంటి బహుసామాన్యమైన మనిషి. మెదుట యిలాంటి మాటలు మాట్లాడటం సాంబయ్యను ఉక్కిరిబిక్కిరి చేసింది. రామయ్య మాంచి ఆవేశంగా కనిపించాడు... కొంపదీసి సంధిచేస్తలేం కాదుకదా! ఏదో వ్యవహారసంబంధమైన విషయాలు మాట్లాడుకుంటున్నారేమోననే ఉద్దేశంతో, లోపల్నుంచి వంటమనిషిగాని, ముందు దొడ్లో పశువులకొట్టం బాగుచేస్తున్న పనివాళ్లుగాని యీవేపేమీ దృష్టి సారించలేదు. డాక్టర్ను దిగబెట్టి మందు కొనుక్కురాబోయిన నౌకరింకా తిరిగిరాలేదు.

నిర్ఘాంతపోయి చూస్తున్న సాంబయ్యను కుర్చీ మంచందగ్గిరిగా లాక్కుని కూర్చోమని చెప్పి... "మీమరదళ్ల కింకా పెళ్లిళ్లు కాలేదు కదూ!...అవును, ఎలా అవుతుంది? పెళ్లిచేసే తండ్రిని కాస్తా నేను పొట్టనపెట్టుకుంటిని..." అన్నాడు రామయ్య.

"తమ రలా ఏమిటోగా మాట్లాడుతున్నారు..." అన్నాడు కాస్త ధైర్యం తెచ్చుకుని సాంబయ్య... కన్నీళ్ల చారికలలా ఉండగానే శుష్కమైన ఒక చిరునవ్వు

నవ్వి ..."మీ రేమీ భయపడకండి...నేను ఒళ్లు తెలిసే మాట్లాడుతున్నా ... మీ మామగార్ని చంపింది మొదలు నేను పడుతున్న నరకయాతన ఆ పరమాత్ముడికి తెలియాలి... నే నింక ఎక్కువరోజులు బతకను. మీకు తెలిసే ఉంటుంది...నా పెంపుడు కొడుకు రైలుకిందపడి చచ్చిపోయాడు...నా కేమీ చింత లేదిప్పుడు...." దగ్గుతెర కొద్దిగా ఒచ్చేసరికి ఒక క్షణం ఆగి మళ్ళా సాగించాడు రామయ్య:

"చూశారూ! ఆ పిల్లలకు మీరే మొగదిక్కు...పైగా మేనత్తకొడుకులు మీరు... పెళ్లిళ్లూ, పేరంటాళ్లూ చెయ్యాల్సింది మీరు..." సాంబయ్య ఏదో చెప్పబోతే సందివ్వకుండా . రామయ్యే తను చెప్పదలుచుకుంది పూర్తిచేశాడు...

"నాకు తెలుసు మీ స్థితిగతులు...నా స్థితిగతులూ మీకు తెలుసు...గుమాస్తాల దగ్గిర అన్ని వివరాలూ ఉన్నాయి—ఏఏ ఫ్యాక్టరీల్లో ఎన్నెన్ని భాగాలు నాకున్నాయో!...నగదంతా బ్యాంకులో వుంది....ఇనప్పెట్టెలో వెండి బంగారాలున్నాయి....అంతా మీపరం చేస్తున్నా.... మీరు తిన్నా, మీభార్యాపిల్లలకు పెట్టినా సుబ్రహ్మణ్యంగారి రక్తమే.......మరదళ్ల పెళ్లిళ్లుమటుకు చక్కని సంబంధాలు తెచ్చి చెయ్యండి....తండ్రిలేని లోపం తీర్చటం మీ తరం కాదు....బ్రహ్మతరంకూడా కాదు.... అయినా శక్తివంచన లేకుండా. ..మనుష్య ప్రయత్నంగా...."

...దగ్గుతెర కొంచెం తీవ్రంగా ఒచ్చిందీమాటు...కాస్త తమాయించిన తర్వాత "నా ఉత్తరాధికారిగా మిమ్మల్ని నియమిస్తూ కాగితం రాస్తున్నా" అన్నాడు.

సాంబయ్య దిగ్భ్రమ చెందాడు. "...మీరు మనుష్యులు కారు...సాక్షాత్తు.." ....అర్ధోక్తిలోనే రామయ్య అందుకుని "రాక్షసిని...."అన్నాడు.